క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకయ్యబాబు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం సీతారామపురం ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం రాస్, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ వెంకయ్య బాబు మొత్తం 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఏడేళ్లుగా రాస్, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో వడమాలపేట, పుత్తూరు పరిసర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని పాఠశాల హెచ్ఎం నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి కుమారి, మహేంద్ర, అమరావతి, రాస్ సిబ్బంది తేజ, మీనా, ద్రాక్షాయణి, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ధర్నా

పుత్తూరు: ఎల్ఐసీలో ఉద్యోగ నియామకాలకు పూనుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఎల్ఐసీ ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామంలో ధర్నా చేశారు. యూనియన్ కార్యదర్శి లక్ష్మణకుమార్ మాట్లాడుతూ, అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈ కార్యక్రమం చేసినట్టు చెప్పారు. ఎల్ఐసీలో ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో నియామకాలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ఖాళీలు భర్తీ చేయాలని, యూనియన్‌కు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలైన సౌందర్యరాజ్

కార్వేటినగరం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండలంలోని అమ్మపల్లె క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గంగాధరనెల్లూరు మండలం కొండేపల్లెకు చెందిన సౌందర్యరాజ్ ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం వెళ్తుండగా, అమ్మపల్లె క్రాస్ మలుపు వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలవడంతో స్థానికులు అతడిని కార్వేటినగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం చేరవేశారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశు వైద్యశాల ఎదుట నిరసన



పశు వైద్యశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పాడిరైతులు

పాలసముద్రం: స్థానిక పశు వైద్యశాలలో మందులూ లేవు..పశు వైద్యాధికారులూ లేరని గురువారం పాడి రైతులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, పశువులను చికిత్స నిమిత్తం తీసుకువస్తే మందులు బయట నుంచి తీసుకువచ్చి ఇస్తే వైద్యం చేస్తున్నారని, పశువైద్యాధికారి సక్రమంగా రాకపోవడంతో వచ్చిన ప్రతిసారీ ఇబ్బందులు పడుతూ తిరిగి తమ ఊర్లకు వెళ్తున్నామని మండిపడ్డారు. పశు వైద్యాధికారి రాకపోవడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాపోయారు. ఒకవేళ పశు వైద్యాధికారి వచ్చిన్నా మధ్యాహ్నం ఒంటి గంటకే తాళం వేసి వెళ్లిపోతున్నారని, ఇకనైనా అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

చిత్తూరు అర్బన్ : వీధి కుక్కల కుటుంబ నియంత్రణ కోసం చిత్తూరు నగరపాలక సంస్థ వాహనాల షెడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'అనిమల్ బర్త్ కంట్రోల్' కేంద్రాన్ని (ఏబీసీ) జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. రూ.15 లక్షలు కలెక్టర్ ప్రత్యేక నిధులతో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ చేయడానికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. చిత్తూరు నగరపాలక పరిధిలో సుమారు 7–8 వేల వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా ఉందని.. వీటి జనాభాను నియంత్రించకుంటే భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున.. నగరపాలక పరిధిలో ఏబీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆపరేషన్లు నిర్వహించడంపై జిల్లాలోని పశు వైద్యులు పది మందికి రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనీలతో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎంతో ముఖ్యమైన ఇలాంటి మంచి పనులు చేయడంలో కలెక్టర్ ఎంతో ముందుంటారని అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, పశుసంవర్ధక శాఖ జేడీ డా.ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ బీఎస్ రాజసింహులు, ఎంహెచ్వో డా.లోకేష్, ఎంఈఓ వెంకటరామి రెడ్డి, ఏడీ డా.చంద్రశేఖర్, నగరపాలక, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.



వడమాలపేట ఏంఎంపురంలో చెత్త సేకరణ కోసం నిర్మించిన షెడ్డు



ఏంఎం పురంలో స్థానికులు రోడ్డు పక్కన వేసిన చెత్త

చెత్త సరే..! సంపదేదీ?

- రూ. 2.55 కోట్లు చెత్త పాలు
- ఇక వర్మీ కంపోస్టు తయారీ ఎప్పుడో..?

వడమాలపేట (విజయపురం): గ్రామాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తూ 2014లో టీడీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు చెత్తకే పరిమితమయ్యాయి తప్పితే సంపద సృష్టి దిశగా పయనించడం లేదు. అప్పట్లో ఎన్ఆర్ఈజీఎస్ విభాగంలో ఈ ఈ కేంద్రాల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేశారు. ఆయా గ్రామాల అధికార పార్టీ సర్పంచులు, తెలుగుతమ్ముళ్లు కాంట్రాక్టర్ల అవతారమెత్తి నిర్మించారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. కొంత వరకు చెత్తను సేకరించి, వర్మీ కంపోస్టు తయారు చేసి సంపద సృష్టి వైపు మళ్లించింది. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలవుతున్నా ఆ కేంద్రాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అవి అలంకారప్రాయంగా మారిపోవడంతో వర్మీ కంపోస్టు తయారీ ప్రశ్నార్థకంగా మారింది.

91 యూనిట్లు–రూ.2.55 కోట్లు

నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాలలో మొత్తం 91 యూనిట్ల ఏర్పాటుకు రూ. 2.55 కోట్లు మంజూరైనట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. పుత్తూరు మండలంలో 11 కేంద్రాలకుగాను 9, నిండ్ర మండలంలో 21 కేంద్రాలగాను 13, విజయపురం మండలంలో 25 కేంద్రాలగాను 10, వడమాలపేట మండలంలో 20 కేంద్రాలగాను 8 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన కేంద్రాలు పనుల ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇప్పటి వరకు పూర్తయిన కేంద్రాల్లో ఒకట్రెండు మినహా తక్కిన కేంద్రాలు నిరుపయోగమయ్యాయి. వాటికి రంగులు వేయడం తప్పితే సేంద్రియ ఎరువుల తయారీ ఊసే లేదు.

ఎక్కడి చెత్త అక్కడే

చెత్త నుంచి సంపదతో పాటు వీటిలో వర్మీ కంపోస్టు తయారీపై కూడా అధికారులు తొలుత దృష్టి పెట్టారు. అయితే ప్రస్తుతం వీటిపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా పంచాయతీ స్థలాలున్న చోట్ల కాంట్రాక్టర్లు నిధులు దోచుకునేందుకు వీటిని నిర్మించి వదిలేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది.

డస్ట్‌బిన్లు ఎక్కడ ?

చెత్త సంపద కేంద్రాలు నిర్మించి ఇళ్లలో చెత్తను అందులో వేయడానికి గ్రామస్తులకు ఇంటికో రెండు డస్ట్‌బిన్లను అందజేయాలని పంచాయతీలకు సరఫరా కూడా చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం మూలాన ప్రజలకు అందాల్సిన డస్ట్‌బిన్లు ఇప్పటికీ గ్రామాల్లో అందలేదు. దీంతో లక్ష్యం చెత్తపాలవుతోంది.

ఉపయోగిస్తున్నాం

వడమాలపేట మండలంలో అన్ని పూర్తయ్యాయి. ప్రతి చోటా చెత్తను సేకరించి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నా. ఎక్కడగానీ అవకతవకాలు జరగలేదు. డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్నాం.

– దయాకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, వడమాల పేట

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలూ కీలకమే

–డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్



కెమెరాలను చూపుతున్న డీఎస్పీ

నగరి : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కూడా కీలకమేనని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. గ్రామాలు, పట్టణాల ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంలో చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. సీసీ కెమెరాల నిఘాతో చోరీలు, హత్య, రోడ్డు ప్రమాదాలు మొదలైన నేరాలకు అడ్డుకట్ట వేయడంలో దోహదం చేస్తుందని, ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో వీటి ఏర్పాటు ఎంతో ఉపయోగమన్నారు. రూ.2 వేలకు ఇవి అందుబాటులో ఉన్నాయని, అవసరమైనవారు సంప్రదించాలని కోరారు. డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

నగరి : మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భార్గవి అధ్యక్షతన ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 విభాగాలకు సంబంధిత సమీక్ష నిర్వహిస్తామని, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం

- 14405కు సమాచారం అందించండి
- సారా తయారీకి స్వస్తి పలికితే జీవనోపాధి కల్పన
- ఆ గ్రామాలను సారా రహితంగా చేయడానికి ప్రత్యేక కార్యాచరణ
- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



విజయశేఖర్

కార్వేటినగరం: అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం మోపడానికి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ వెల్లడించారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు, బెల్టు షాపులు.. ఇత్యాది వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి వాటికి అడ్డుకట్ట వేసే దిశగా పూనుకుంటున్నట్టు చెప్పారు. గతంలో ఎక్సైజ్, పోలీస్ శాఖ మాత్రమే సారా వ్యాపారాలపై దాడులు చేసేవని, ఇప్పుడు ఈ శాఖలతో పాటు అటవీ, పంచాయతీరాజ్ శాఖలు కూడా నిఘా ఉంచుతాయన్నారు. అటవీ ప్రాంతాల్లో సారా తయారు చేస్తే అటవీ శాఖ కేసులు నమోదు చేస్తుందని, నిందితులు మహిళలైనా, పురుషులైనా ఏ సమయంలోనైనా అరెస్టు చేయడానికి కోర్టు ఆదేశాలిచ్చాయని చెప్పారు. సారా తయారీకి స్వస్తి పలికితే వారికి వివిధ రూపాల్లో జీవనోపాధి కల్పిస్తామని వివరించారు. ఎక్కడైనా సారా తయారీ, విక్రయాలు చేస్తున్న పక్షంలో 14405 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడమే కాకుండా రివార్డు కూడా ఇస్తామన్నారు. తమ పరిధికి సంబంధించి సారా తయారీలో పాలసముద్రం మండలంలోని నరసింగాపురం ప్రథమ స్థానంలో ఉందని, అలాగే రెండో స్థానంలో వెదురుకుప్పం మండలం నక్కలాంపల్లె, యనమలమంద, శ్రీరంగరాజపురం మండలంలో చిన్నతయ్యూరు, చిల్లమాకలపల్లి ఉన్నాయని, వీటిని సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సీఐ శిరీషాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలను పరిష్కరించండి

– చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు: రైతులు రీ–సర్వేపై రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన వినతులను జాప్యం చేయకుండా పరిష్కరించాలని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. రైతుల వినతులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.తహసీల్దార్ తులసీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

107 మద్యం బాటిళ్లు స్వాధీనం : ముగ్గురిపై కేసు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఐ రాజ్‌కుమార్

కార్వేటినగరం : బెల్టుషాపులపై దాడులు నిర్వహించి 107 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ రాజ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. కేఎం పురం, కొల్లగుంట క్రాస్ రోడ్డులో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై దాడులు నిర్వహించి 98 క్వార్టర్ బాటిళ్లు, 9 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఏఎస్ఐ మునికృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి



తాగునీటి సమస్యలపై మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల, హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలసముద్రం: వేసవి సమీపిస్తుండడంతో మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ కోరారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చేతిపంపులు వినియోగంలోకి తేవాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ, రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పొందాలంటే 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం (కార్డు) పొందడం తప్పనిసరి అన్నారు. ఉపాధి హామీ ఏపీఓ మార్గేల్ మాట్లాడుతూ, జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజులు పనులు కల్పిస్తున్నామని, దీనిని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు శాఖల పురోగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ క్రిష్ణమోహన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్, పశువైద్యాధికారి యశస్వి, వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్, ఐసీడీసీ సూపర్‌వైజర్ అనురాధ, ఎంపీటీసీ గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు గాలి మహేష్ బాబు, భాస్కర్‌రెడ్డి, అనురేఖ, జీవిత, షీబా, లిల్లీ, నరసింహరాజు, అయ్యప్పన్, అమరావతి, నాగమ్మ, సీ.మేనక, భానుప్రియ, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు..!



మాట్లాడుతున్న డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి

కార్వేటినగరం: విద్యార్థులు జీవితంలో స్థిరపడేందుకు ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, యూత్ సర్వీసెస్, సెట్విన్ (తిరుపతి) సహకారంలో వ్యక్తిత్వ వికాసం, స్టడీ స్కిల్స్, అలాగే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ లక్ష్యం వైపు తప్పితే ఇతర వ్యాపకాల వైపు దృష్టి మరల్చరాదన్నారు. సెట్విన్ సీఈఓ కె.మోహన్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనంజయరెడ్డి మాట్లాడారు. కౌటిల్య సీనియర్ మేనేజర్ ఎన్ఎస్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు సుబ్బారావు, జోగిప్రసాద్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు



సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

పుత్తూరు: విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కారాదని, వాటికి దూరంగా ఉండాలని కేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అన్నారు. 'విద్యార్థులకు మత్తు పదార్థాలు–ప్రమాదకరం' అనే అంశంపై గురువారం స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కేకేసీ కళాశాలకు చెందిన ఎలైట్ యాంటీ–నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈఏజీఎల్ఈ) క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తుందన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే విలువైన జీవితం ఛిద్రం అవుతుందన్నారు. బాల నేరస్తుల చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో చాలా మంది విద్యార్థులు తెలిసీ తెలియక చేసిన నేరాలకు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, ఆ పరిస్థితికి దుర్వ్యసనాలే కారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ పెయింట్ విక్రేత అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకొన్న పెయింట్స్ డబ్బాలు

పుత్తూరు : పట్టణంలో నకిలీ ఏషియన్ పెయింట్ విక్రయిస్తున్న ఓ షాపు యజమానిని అరెస్టు చేసినట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు .. తమిళనాడు రాష్ట్రం విల్లుపురం నుంచి ఏషియన్ పెయింట్ కంపెనీ ఉద్యోగి తంబుస్వామి గురువారం నకిలీ పెయింట్స్ విక్రయాలపై ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. పుత్తూరు పట్టణానికి చెందిన సుంప్రీత్(29) అనే వ్యక్తి ఏషియన్ కంపెనీ డబ్బాలలో నకిలీ పెయింట్ నింపి విక్రయిస్తున్నాడని, దీనివల్ల తమ కంపెనీ పేరు దెబ్బతినడంతో పాటు వినియోగదారులు మోసపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. దీనిపై దర్యాప్తు చేపట్టగా మదనకుమార్ కొడుకు సుంప్రీత్ స్థానిక మండీ స్ట్రీట్‌లోని తన పెయింట్ షాపులో నకిలీ ఏషియన్ పెయింట్ విక్రయిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. సుంప్రీత్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా పట్టణం లోని ఆర్ఎస్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ గదిని అద్దెకు తీసుకొని అక్కడ ఏషియన్ పెయింట్ డబ్బాలలో నకిలీ పెయింట్ నింపుతున్నట్లు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. ఆ గదిని పరిశీలించగా ఏషియన్ పెయింట్ డబ్బాలలో నకిలీ పెయింట్ నింపిన ఇరవై లీటర్ల డబ్బాలు 10, పది లీటర్ల డబ్బాలు 6తో పాటు ఖాళీ పెయింట్ డబ్బాలను స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముళ్లకంపలతో శ్మశానం

–అంత్యక్రియలకు అవస్థలు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం, నెన్నూరు వారి వెంకటరెడ్డి కండ్రిగ (ఎన్‌వీఆర్) ఆది ఆంధ్రవాడ శ్మశాన వాటిక ఎటుచూసినా ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. ఆది ఆంధ్రవాడలో సుమారు 80 కుటుంబాలు న్నాయి. ఎవరైనా మరణిస్తే శ్మశానంలో అంత్యక్రియల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామస్తులు చెప్పారు. గాలి, వర్షాలకు గదులపై రేకులు పగిలిపోయి గోడలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. పిచ్చిమొక్కలు తొలగించడంతోపాటు గదులను వినియోగానికి అనుకూలంగా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



ముళ్ల చెట్లతో నిండిన ఎన్‌వీఆర్ కండ్రిగ ఆది ఆంధ్రవాడ శ్మశాన వాటిక, మొండి గోడలు దర్శనమిస్తున్న గదులు

హెల్మెట్ ధరించాలి



ద్విచక్ర వాహనదారుడితో మాట్లాడుతున్న ఎస్ఐ

పాలసముద్రం: ద్విచక్ర వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించడంతోపాటు హెల్మెట్ విధిగా ధరించాలని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప అన్నారు. గురువారం టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో షోలింగర్–పల్లిపట్టు జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. వాహనాలకు రికార్డులు కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లి ప్రమాదాల పడరాదని హితవు పలికారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనాలకు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఏది లేకపోయినా జరిమానా తప్పదని హెచ్చరించారు. అలాగే రికార్డులు లేని వాహనాలకు ఆన్‌లైన్‌లో జరిమానా విధించారు.

మార్కెట్ వేలం : రూ.62.56 లక్షల ఆదాయం

- అభ్యర్థనతో తగ్గిన ఆటో స్టాండు, దినసరి మార్కెట్
- గత ఏడాదికన్నా రూ.25 వేలు మాత్రమే పెరుగుదల



వేలం నిర్వహిస్తున్న కమిషనర్, సిబ్బంది

నగరి : ఒక ఏడాదికి మార్కెట్ వేలంలో మున్సిపాలిటీకి రూ.62.56 లక్షల ఆదాయం చేకూరింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు, టాక్సీ ఆటో స్టాండు, జంతువధశాల గుత్తహక్కులు కేటాయించడానికి గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. అధికారుల వేలం నిర్వహించడానికి మునుపు కొన్ని రోజుల పాటు జరిగిన సంఘటనల ప్రభావం వేలంలో కనిపించింది. ఆటో డ్రైవర్లు, డైలీ మార్కెట్ నిర్వహించేవారు గుత్తహక్కులు ఎక్కువగా పాడితే గేటు వసూళ్లు పెరుగుతున్నాయని వాటిని రోజువారీ వచ్చే ఆదాయంతో భరించలేమని, వాటిని తగ్గించాలంటూ నిరసన వ్యక్తం చేయడం, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం విదితమే. వీటి ప్రభావం గురువారం వేలంలో ప్రస్ఫుటంగా కనిపించింది. గత ఏడాది రూ.15.05 లక్షలు పలికిన ఆటోస్టాండు వేలం ఈ ఏడాది అనూహ్యంగా తగ్గి రూ.12.19 లక్షలే పలికింది. అలాగే గత ఏడాది రూ.19.21 లక్షలు పలికిన దినసరి మార్కెట్ ఈ ఏడాది అతి స్వల్పంగా రూ.1000 మాత్రమే పెరిగి రూ.19.22 లక్షల వద్ద నిలిచింది. మొత్తంగా ఈ రెండింటి వేలంలో గత ఏడాది కన్నా రూ.2.85 లక్షల ఆదాయం తగ్గింది. బస్టాండు వేలం గత ఏడాది రూ.9.95 లక్షలు పలికితే ఈ ఏడాది స్వల్పంగా రూ.10 వేలు పెరిగి రూ.10.05 లక్షలకు చేరుకుంది. జంతువధశాల గత ఏడాది రూ.39 వేలు పలికితే ఈ ఏడాది రూ.45వేలు పలికింది. గుత్తహక్కులు తగ్గినందున ఇకపై గుత్తహక్కుదారులు చేసే వసూళ్లు తగ్గాల్సి ఉంది. దీనిపై మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది.

ఆదాయ వనరుగా నిలిచిన వారపు సంత

వారపుసంత మాత్రమే మున్సిపాలిటీకి ఆదాయాన్ని పెంచే వనరుగా నిలిచింది. గత ఏడాది రూ.17.71 లక్షలు పలికిన వారపుసంత వసూళ్ల హక్కులు ఈ ఏడాది రూ.20.65 లక్షలు పలికింది. ఈ ఏడాదికి వారపు సంత రూ.2.94 లక్షల అదనపు ఆదాయాన్ని చేకూర్చింది. వారపు సంత హక్కులు ఎం.హరిబాబు, దినసరి మార్కెట్‌ను సీఎం భాస్కర్, బస్టాండును ఎస్.సుబ్రమణ్యం, ఆటోస్టాండును ఎం.యోవాన్, జంతువధశాలను ఎం.సలీం హెచ్చుపాటతో కైవసం చేసుకున్నారని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు.